


రుణమో రామచంద్రా..!

ప్రభుత్వం మారినా అదే తీరు



నంద్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'సీసీఆర్ కార్డులు తీసుకున్న కౌలు రైతులకు ఆశించిన స్థాయిలో రుణాలు అందటం లేదు. కౌలు రైతుల పట్ల బ్యాంకర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి, లక్ష్యం మేరకు రుణాలు ఇవ్వాలి. వ్యవసాయాభివృద్ధికి సహకరించాలి.' ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బ్యాంకర్లను కోరారు. సాక్ష్యాత్తు సంబంధిత శాఖ మంత్రి కౌలు రుణాలపై ఇలా మాట్లాడారంటే రుణాలను దక్కించుకోవటంలో కౌలు రైతుల పరిస్థితి ఏమిటో అర్థం అవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు రూ.130 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటి వరకు రూ.25 కోట్లు అందించారు. మొత్తానికి ప్రభుత్వం మారినా కౌలు రైతుల పరిస్థితి ఏమాత్రం మారలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం చెబుతున్నా..



ఐదేళ్ల వైసీపీ పాలనలో కౌలు రైతు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాడు. 2014--19 మధ్య ఉన్న కౌలు రైతు కార్డు విధానంలో మార్పులు తీసుకొచ్చి అన్నింటినీ సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డ్)తో ముడిపెట్టింది. గత వైసీపీ ప్రభుత్వ తీరుతో కౌలు చేయడమంటేనే గుదిబండ అనే అభిప్రాయానికి అన్నదాతలు వచ్చారు. రుణాలు మొదలుకుని నష్టపరిహారం వరకు అడుగడుగునా కౌలు రైతు ఐదేళ్ల పాటు నానా ఇబ్బందులు పడ్డాడు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఇకపై తమ ఇక్కట్లకు తెరపడ్డట్లేనని కౌలు రైతాంగం భావించింది. అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డుల విషయంలో పెద్ద ఎత్తున లక్ష్యాలను విధించి వ్యవసాయ సిబ్బందిని పరిగెత్తించింది. కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలని కోరింది. కానీ గత ప్రభుత్వంలో బ్యాంకర్ల తీరు ఎలా ఉందో ఇప్పుడు కూడా దాదాపుగా అదే రీతిన ఉన్నది. దీంతో కౌలు రైతులకు రుణాల విషయంలో అన్యాయం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వార్షిక పద్దు ఆధారంగా ఖరీఫ్ రుణ లక్ష్యం దాదాపు పూర్తయింది. ఇందులో కౌలు రైతుల వాటా తీస్తే నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అన్న చందాన ఉంది. గతంతో పోలిస్తే కౌలు రైతులకు అదనంగా ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. కౌలు రైతులను ఆదుకోవాలనే ప్రభుత్వ లక్ష్యాలను దెబ్బతీసే విధంగా బ్యాంకర్లు నిబంధనల ఉచ్చు వేసి మొండిచెయ్యి చూపిస్తున్నారు. దీనికి తోడు సీసీఆర్ కార్డులు జారీ చేసి వ్యవసాయ శాఖ మిన్నకుండడం కూడా కౌలు రైతులకు రుణాల విషయంలో ఇప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉంది. ఈ ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కౌలు రైతుల రుణ వాటాలో ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాలను ఇప్పుడు జారీ చేసిన మొత్తాలను పోలిస్తే రుణాల విషయంలో బ్యాంకుల నిర్లక్ష్యం బయటపడుతోంది. కూటమి ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నామని కానీ ఇప్పటికీ రుణాల విషయంలో తమకు నిరాశే ఎదురవుతుందని కౌలు రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- సహకరించని బ్యాంకర్లు
- కౌలు రైతుకు అందని రుణాలు



శ్రద్ధ చూపని బ్యాంకర్లు..

కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు అందించాలని కూటమి ప్రభుత్వం అధికారులకు చెప్పింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 వేల సీసీఆర్ కార్డుల ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇక వార్షిక పద్దు విషయంలో కూడా స్పష్టతతో వ్యవహరించాలని నిర్ణయించుకుంది. వ్యవసాయ రుణాల్లో కౌలు రైతాంగం వాటా ఐదు శాతం వరకు ఉండాలని, ఇందుకు బ్యాంకర్లు కూడా మానవతా దృక్పథంతో సహకరించాలని ఖరీఫ్ ఆరంభంలోనే తెలిపింది. కానీ ఖరీఫ్ ముగింపుకొచ్చినా కౌలు రైతులకు రుణాలు అందలేదు.

లక్ష్యం ఘనం.. చేతలు శూన్యం

ఉమ్మడి జిల్లాలో రైతులకు కౌలు రుణాల రూపంలో రూ.130 కోట్లు అందించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇప్పటి వరకు కౌలు రైతులకు కేవలం రూ.25 కోట్ల రుణ లక్ష్యాలు మాత్రమే పూర్తయ్యాయి. గతంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో సీసీఆర్ కార్డుల జారీలో కూడా పెద్దగా మార్పు కనిపిస్తున్నట్లు లేదు. సీసీఆర్ కార్డులు తీసుకునేదే బ్యాంకుల నుంచి రుణాలు వస్తాయనే ఆశతో. కానీ సీసీఆర్ కార్డులు తీసుకున్న వారికి రుణాలు అందడం లేదు.

సహకారం కరువు..

వార్షిక పద్దు ప్రకటించేటప్పుడు ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో సహకరిస్తామని బ్యాంకర్లు చెబుతారు. కానీ ఆచరణలో కొచ్చేసరికి సవాలక్ష నిబంధనలతో మొండిచెయ్యి చూపిస్తుండటంతో కౌలు రైతులకు రుణాలు దక్కడం లేదు. ఆ అరకొర రుణాలు కూడా పూర్తిగా వ్యక్తిగత రుణాలు కాకుండా రైతుమిత్ర గ్రూపులు, జాయింట్ ఫార్మర్స్ గ్రూప్‌కి ఇస్తున్నారు. నెలకొకసారి కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో సమీక్ష జరిపి బ్యాంకులకు కూడా కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో లక్ష్యాలు నిర్దేశిస్తేనే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది.



స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం

అహోబిలేశా.. పాహిమాం

శాస్త్రోక్తంగా ముగిసిన పవిత్రోత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం నరసింహ నామ స్మరణతో మారుమోగింది. అహోబిలేశా.. పాహిమాం పాహిమాం అంటూ భక్తులు నినదించారు. ఏడాదిపాటు పూజా కైంకర్యాల్లో జరిగిన తప్పులు, దోషాల నివారణతోపాటు లోక కల్యాణార్థం దిగువ అహోబిలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు శాస్త్రోక్తంగా నిర్వహించిన చతుస్థానార్చన, హోమం, మహా పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. అవభృత స్నానం నిర్వహించిన అనంతరం అహోబిలేశ్వరుడు యాగశాల నుంచి గర్భాలయానికి వేంచేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో కుంభప్రోక్షణం నిర్వహించారు. ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు విశేష పూజలు, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలి వచ్చి పూజా కార్యక్రమాల్లో, గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

ఎస్పీవై ఆగ్రోస్‌లో సీఐడీ తనిఖీలు




నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రోస్‌లో సీఐడీ అధికారుల బృందం

నంద్యాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ శివారులోని ఆటో నగర్‌లో ఉన్న ఎస్పీవై ఆగ్రోస్ కంపెనీలో మంగళవారం ఏపీ సీఐడీ అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం డిస్టిల్లరీ కంపెనీల్లో సీఐడీ అధికారుల తనిఖీల్లో భాగంగా నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రోలో అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా నేతృత్వంలో బృందం విస్తృత తనిఖీలు చేపట్టింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కంపెనీలో జరిగిన మద్యం తయారీ, లావాదేవీలు, కంపెనీ నిర్వహణ దస్త్రాలను మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో సీఐడీ సీఐ గిరిబాబు, సీఐడీ సిబ్బంది, నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, సిబ్బంది, నంద్యాల తాలుకా అర్బన్ ఎస్సై గంగయ్య యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.



కేఎంసీలో ర్యాగింగ్ రక్కసి

- యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన నిల్
- కర్నూలు మెడికల్ కాలేజీలో కనిపించని పోస్టర్లు



కోటి ఆశలతో కర్నూలు వైద్య కళాశాలలో చేరిన వారికి ర్యాగింగ్ పేరిట భయంకర అనుభవం ఎదురవుతోంది. కొత్తగా కాలేజీలో చేరిన విద్యార్థులతో స్నేహాన్ని బలపరుచుకునే విధానాన్ని విస్మరించి, తోటి విద్యార్థి మానసికంగా కృంగిపోయేలా హింసకు ప్రేరేపిస్తున్నారు కొందరు సీనియర్లు. ఈ హింసకు 'ర్యాగింగ్' అనే పేరు పెట్టి మరీ తోటి విద్యార్థుల జీవితాలను చిదిమేసే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. ఇది విద్యార్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి, చదువులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ర్యాగింగ్ కారణంగా విద్యార్థుల్లో ఆందోళన, భయం, నిరాశ పెరుగుతున్నాయి. పటిష్టమైన నియంత్రణ చర్యలపై కళాశాలలు సరైన మొగ్గుచూపకపోవడంతో ర్యాగింగ్ రక్కసి విరుచుకుపడుతోంది. తాజాగా కర్నూలు మెడికల్ కళాశాలలో జరుగుతున్న ర్యాగింగ్ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వివరాలు 6లో

సీబీసీఐడీ విచారణకు ఆదేశం..!

- ఆర్‌వోఆర్ కేసు విచారణలో అధికార దుర్వినియోగం
- హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

6



తుంగభద్రకు భారీ వరద

- 25 గేట్ల ద్వారా 1,12,136 క్యూసెక్కుల నీటి విడుదల

6



మోదీ మెచ్చిన రైతు

- చిరుధాన్యాల సాగులో స్ఫూర్తిగా నిలుస్తున్న రామసుబ్బారెడ్డి

6

రైతును దగా చేస్తున్న సీసీఐ

- రైతులకు దళారులే దిక్కు
- మార్కెట్ యార్డుల్లో కేంద్రాలు పెడితేనే రైతుకు న్యాయం
- జిన్నింగ్ మిల్లులోనే కేంద్రాల ఏర్పాటుతో దళారుల హవా
- 90 శాతం గ్రామాల్లోనే విక్రయాలు
- విచ్చలవిడిగా కల్తీ, నాసిరకం విత్తనాలు



పెంచికలపాడులోని పత్తి జిన్నింగ్ మిల్లు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి రైతులను దళారుల నుంచి కాపాడి ఆదుకోవాలి. కానీ ఆచరణలో సీసీఐ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. దీని వల్ల పత్తి రైతులను దళారులు దగా చేస్తున్నారు. అక్టోబరు నుంచి సీసీఐ సంస్థ రైతుల నుంచి పత్తి కొనడానికి సమాయత్తం అవుతోంది. సీసీఐ కేంద్రాల పాత్ర నామమాత్రంగా మారడంతో దాదాపు 90 శాతం పత్తిని గ్రామాల్లో దళారులే కొంటున్నారు. వాళ్లు చెప్పిన ధరకే రైతులు అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే పత్తి సాగులో మొదటి స్థానంలో ఉన్న ఉమ్మడి కర్నూలు జిల్లా ఉంది. కర్నూలు జిల్లాలో దాదాపు సాధారణ సాగు 4 లక్షల హెక్టార్లు కాగా, అందులో సగం 1.90 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతున్నది. నంద్యాల జిల్లాలో కూడా దాదాపు 20వేల హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మంది రైతులు ఈ పత్తి సాగుపైనే ఆధారపడి ఉన్నారు.

మిగతా 7లో..



రెండు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న వరద

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం డ్యాం అధికారులు 2 క్రస్టుగేట్లు 10 అడుగులమేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 62,158 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 31,858 క్యూసెక్కులు మొత్తం 94,016 క్యూసెక్కుల వరద వస్తోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,23,587 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,016 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. జలాశయం రెండు క్రస్టుగేట్ల ద్వారా 66,331 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

మెరుగైన సేవలు అందించాలి

డీపీఓ షేక్ జమీవుల్లా

నంద్యాల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించ డమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి షేక్ జమీవుల్లా అన్నారు. నంద్యాల డివిజన్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నంద్యాల డివిజన్ స్థాయిలో ఈఓఆర్డీలు, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యతగా గుర్తించిన ఆర్థిక వనరులతో పాటు మరో 25 అంశాలపై సమీక్షించారు. ఇటీవల చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజా అవసరాలు తీర్చేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. ఇదే క్రమంలో 15 ఆర్థిక నిధుల ద్వారా ప్రాధాన్యతా పనులను గుర్తించేందుకు ప్రభుత్వం సన్నాహక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పన్ను వసూళ్లలో, తాగునీరు, పారిశుధ్యం వంటి వాటిపై నిరంతర ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. డోన్, ఆత్మకూరు డివిజన్ ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులతో జూమ్‌ద్వారా సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్ధం







చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు

మోదీ మెచ్చిన రైతు



- చిరుధాన్యాల సాగులో నంద్యాల వాసి
- రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్న రామసుబ్బారెడ్డి

మధ్యాహ్న భోజన పథకంలో చేర్చాలి

చిరుధాన్యాలను సాగు చేసేలా రైతులు, వాటిని ఆహారంగా తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. అదే సమయంలో రైతులు పండించిన పంటను ప్రాసెస్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. గోధుమ, వరి, ఇతర పంటలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని చిరుధాన్యాలకు కూడా ఇవ్వాలి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా చిరుధాన్యాలను చేర్చాయి. అన్ని రాష్ట్రాల్లో ఈ విధానం అమలు అయ్యేలా చూడాలి.

- రామసుబ్బారెడ్డి, రైతు

నంద్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):

నంద్యాలకు సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మద్దూరు గ్రామం అది. ఆ గ్రామం శివారులోని ఓ సువిశాల వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న చిరుధాన్యాల పంటల మధ్య ఓ 50 ఏళ్ల వ్యక్తి కలియ తిరుగుతూ అన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. అక్కడే ఉన్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌కు వచ్చి పలు సూచనలిస్తున్నారు. ఆ తరువాత ఆ ప్రాసెసింగ్ యూనిట్ పక్కనే ఉన్న బేకరీలోకి వెళ్లి చిరుధాన్యాలతో బిస్కెట్లు, లడ్డూల తయారీలో నిమగ్నమయ్యారు. ఆయనే ప్రధాని మెచ్చిన రైతు రామసుబ్బారెడ్డి. అందరూ నడిచే దారిలో కాకుండా పురుగు మందుల అవశేషాలు లేని, ఆరోగ్యానికి మేలు చేసే చిరుధాన్యాలు పండించాలని రామసుబ్బారెడ్డి భావించాడు. ఆ మేరకు పంటలు సాగు చేయడమే కాకుండా వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. ఆయన కృషి ప్రధాని నరేంద్ర మోదీ వరకు వెళ్లింది. దీంతో మోదీ తన మన్ కీ బాత్ కార్యక్రమంలో గత ఏడాది రామసుబ్బారెడ్డిని ప్రత్యేకంగా ప్రశంసించారు.



మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ సిబ్బందితో రామసుబ్బారెడ్డి

బనగానపల్లె మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన కేవీ రామసుబ్బారెడ్డిది వ్యవసాయ కుటుంబం. అప్పటి మద్రాసులో ఐసీడబ్ల్యూ పూర్తి చేశాక ఢిల్లీలో మంచి ఉద్యోగం రావటంతో వ్యవసాయంతో ఆయనకు ఉన్న అనుబంధం తెగిపోయింది. అయితే రూ.5 లక్షల జీతం వచ్చే ఉద్యోగం చేస్తున్నా మనస్సు మాత్రం వ్యవసాయం మీదకే లాగేది. దీంతో చేస్తున్న ఉద్యోగానికి 2018లో రాజీనామా చేసి వ్యవసాయం చేసేందుకు ఢిల్లీ వదిలి నంద్యాలకు వచ్చేశారు. ఉద్యోగం చేస్తున్న సమయంలో కూడబెట్టిన డబ్బుతో నంద్యాలకు దగ్గరలోని మద్దూరు గ్రామంలో 20 ఎకరాలు కొనుగోలు చేశారు. నంద్యాలకు వచ్చీ రాగానే ఈ వ్యవసాయ క్షేత్రాన్ని తన ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. పండ్ల సాగు సరైనదని భావించి సేంద్రియ వ్యవసాయ విధానంలో తోటలను వేశారు. రూ.30 లక్షల నష్టం రావడంతో మళ్లీ ఉద్యోగం వైపు వెళ్లాలా అనే సందిగ్ధంలో పడ్డాడు. అదే సమయంలో చిరుధాన్యాల ఆవశ్యకతను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. పోషకాహార లోపాన్ని తరిమికొట్టడానికి చిరుధాన్యాల విప్లవం రావాలంటూ మోదీ పిలుపునిచ్చారు. అంతేగాకుండా వీటి సాగును ప్రోత్సహించేందుకు 2018ని చిరుధాన్యాల సంవత్సరంగా జరిపారు. దీంతో ఆయన వ్యవసాయ క్షేత్రంలోని పండ్ల తోటలను తీసేసి చిరుధాన్యాల సాగు వైపు దృష్టి సారించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రస్తుతం పండించే జొన్నలు, రాగులకు తోడు కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెల వంటివి పండించటం మొదలుపెట్టడమే కాకుండా వీటిని ప్రాసెస్ చేసే యూనిట్‌ను కూడా నెలకొల్పారు. సుబ్బారెడ్డి వ్యవసాయం అన్నప్పుడు నిరుత్సాహపరిచిన కుటుంబ సభ్యులే ఆ తర్వాత ఆయన వెంట నడవటం ప్రారంభించారు. వ్యవసాయం, ప్రాసెసింగ్ యూనిట్, చిరుధాన్యాలతో తయారు చేస్తున్న బిస్కెట్లు, కుకీస్, లడ్డూలను మార్కెట్ చేయటంలో సుబ్బారెడ్డి భార్య, పిల్లలతో పాటు ఆయన తమ్ముళ్లిద్దరి కుటుంబ సభ్యులు భాగమయ్యారు. సుబ్బారెడ్డి వ్యవసాయ విధానం మరికొంత మంది రైతులను చిరుధాన్యాల సాగు బాటలో నడిచేలా చేసింది.

రామసుబ్బారెడ్డి స్ఫూర్తితో..

సుబ్బారెడ్డి ఏర్పాటు చేసిన క్షేత్రంలో వివిధ రకాల చిరుధాన్యాలను పండిస్తున్నారు. వీటిని ప్రాసెస్ చేసి ఇడ్లీ రవ్వ, ఉప్మా రవ్వ రూపంలో అందిస్తున్నారు. ఇలా తినలేని వారి కోసం బిస్కెట్లు, కుకీలు, లడ్డూల రూపంలో అందిస్తున్నారు. ఆ ఆలోచనను ఆచరణలో పెడుతూనే మరో వైపు వ్యవసాయ శాస్త్రవేత్తల సాయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చిరుధాన్యాలపై రైతులు, ప్రజలకు ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా రైతులు పండించిన పంటను తానే తీసుకుంటానని భరోసా కల్పించడంతో చాలా మంది రైతులు చిరుధాన్యాల సాగుకు ముందుకు వస్తున్నారు. 2020లో రెండు తెలుగు రాష్ట్రాల్లో చిరుధాన్యాలను పండించే రైతుల సంఖ్య 400 మంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 700కు చేరుకుంది. చిరుధాన్యాల ప్రాముఖ్యాన్ని పెంచేందుకు కొంత కాలం నుంచి ప్రపంచ వ్యాప్తంగా కృషి జరుగుతోంది. ఇక కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనతో ఐక్యరాజ్య సమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరిపింది.



ప్రాసెసింగ్ యూనిట్



సజ్జపంటలో...




పైప్ లైన్ పగిలి..



కోసిగి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని సాతనూరు గ్రామ సమీపంలో పులికనుమ పంప్‌హౌస్ పైపులైన్ పగలిపోయి నీరు ఉవ్వెతున ఎగిసిపడింది. సుమారు 40 ఎకరాల మేర పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. తుంగభద్ర నది సమీపంలో ఉన్న సాతనూరు గ్రామ సమీపంలోని పొలాల్లో పైపులైన్ పగిలి సుమారు పది అడుగుల మేర నీళ్లు పైకి ఉవెత్తున ఎగిసి పొలాల్లో భారీగా నీరు చేరాయి.

తుంగభద్రకు భారీ వరద



హాలహర్వి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర నదికి మళ్లీ భారీ వరద వచ్చి చేరుతోంది. దీంతో టీబీ బోర్డు అధికారులు నదీతీర గ్రామాలను అప్రమత్తంగా ఉండాలని బళ్లారి, కర్నూలు కలెక్టర్లకు సమాచారం ఇచ్చారు. జలాశయానికి వరద పెరుగుతుండటంతో మంగళవారం బోర్డు ఇన్‌చార్జి ఎస్ఈ నీలకంఠ రెడ్డి, సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, దాదాపు 25 గేట్లు ఎత్తి నదికి 1,12,136 క్యూసెక్కుల నీటికి విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 105.788 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 101.461 టీఎంసీలుగా కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 1,12,136 క్యూసెక్కులు ఉండగా అవుట్‌ఫ్లో కూడా అంతేస్థాయిలో నదికి వదిలేస్తున్నారు.

తుంగభద్రమ్మకు సూర్య సింధూరం





తుంగభద్ర జలాశయం నిండు కుండలా కనిపిస్తోంది. డ్యాంలోకి భారీ వేగంతో వరద పోటెత్తుతున్నా పైకి మాత్రం చాలా ప్రశాంతంగా ఉంది. మంగళవారం సాయంత్రం సూర్యాస్తమయాన హోస్పేట్‌లోని తుంగభద్రమ్మ ఇలా కనువిందు చేసింది.
- కర్నూలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):

మున్సిపల్ కమిషనర్ ఆదేశాల కొట్టివేత

కర్నూలు లీగల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని కల్లూరు మండలంలో నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేసి, తొలగించాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. కల్లూరు మండలంలోని 524 సర్వే నెంబరులో పిటీషనర్లు దాసరి నాగ ప్రకాష్, మరో ఇద్దరు భవనాలను నిర్మిస్తున్నారు. ఈ కట్టడాలు అక్రమ కట్టడాలు అని, వీటిని వెంటనే నిలిపివేసి తొలగించాలంటూ నగర మున్సిపల్ కమిషనర్ 2023, 2024లో పిటీషనర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ కట్టడాలను మూడు రోజుల్లోపల తొలగించాలని కమిషనర్ తన ఆదేశాలలో పేర్కొన్నారు. దీంతో పిటీషనర్లు హైకోర్టును ఆశ్రయించి తమ వాదనలు వినిపించుకోవడానికి తగిన అవకాశం ఇవ్వలేదని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు పిటీషనర్లకు రెండు వారాల పాటు అవకాశం ఇచ్చి ఆ తర్వాత నియమ నిబంధనల మేరకు వారి అభ్యంతరాలను పరిశీలించాలని కమిషనర్‌ను ఆదేశిస్తూ కమిషనర్ ఇచ్చిన నోటీసులను కొట్టివేసింది.

కేఎంసీలో ర్యాగింగ్ రక్కసి

- యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన నిల్
- కర్నూలు మెడికల్ కాలేజీలో కనిపించని పోస్టర్లు
- ఆందోళనలో జూనియర్ విద్యార్థులు
- చర్చనీయాంశంగా మారిన తాజా ఘటనలు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో గత ఏడాది మాదిరిగానే ర్యాగింగ్ రక్కసి మళ్లీ జడలు విప్పింది. కాలేజీ ఆవరణలోనే జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు వేధిస్తూ ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారు. ఈనెల 14వ తేదీన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతులు ముగిసిన తర్వాత సీనియర్లు, జూనియర్లను వేధించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ర్యాగింగ్‌పై అవగాహన, అరికట్టాల్సిన కర్నూలు మెడికల్ కాలేజీ అధికారులు మీనమేషాలు వేస్తున్నారు. ఫ్రెషర్స్ చేరి 9 రోజులవుతున్న కాలేజీ ఆవరణంలో కానీ, హాస్టల్స్‌లో గానీ ఎక్కడా యాంటీ ర్యాగింగ్ పోస్టర్స్ వాటి శిక్షలు ఎక్కడా కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం ర్యాగింగ్ పోస్టర్స్, ఫ్లెక్సీలు సీనియర్లలో భయాన్ని కొత్త విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపడానికి ఎంతో దోహదపడుతాయి. కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లు అడ్మిషన్ల సమయంలోనే యాంటి ర్యాగింగ్ పోస్టర్లను అతికించాలి. నెల రోజులవుతున్నా పోస్టర్లు అడ్రస్ ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కాలేజీ ఆవరణంలో ర్యాగింగ్ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.



తొమ్మిది రోజుల క్రితం కొత్త విద్యార్థులకు ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. 240 మంది వైద్యవిద్యార్థులు కొత్తగా చేరారు. ఇందులో రాజ్‌విహార్ మెన్స్ హాస్టల్‌లో 98 మంది, ఉమెన్స్ హాస్టల్‌లో 95 మంది జాయిన్ అయ్యారు. కాలేజీకి నలుగురు వైస్ ప్రిన్సిపాళ్లు, మెన్, ఉమెన్స్ హాస్టళ్లలో చీఫ్ వార్డెన్, డిప్యూటీ వార్డెన్, అసిస్టెంట్ వార్డెన్లు పని చేస్తున్నారు. ప్రతి రోజు కాలేజీ తరగతులు ప్రారంభం, ముగిసే సమయంలో అధికారులు మానిటరింగ్ చేయాలి. అయితే ఏదీ ఎక్కడా జరగడం లేదు. సీనియర్ ప్రొఫెసర్లు తరగతులకు వెళ్లి యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన, చట్టప్రకారం శిక్షల గురించి వివరించాలి. ఇది కూడా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ ఏదీ..?

అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ర్యాగింగ్ ఘటనలు జరుగుతున్నాయి. మెన్స్ హాస్టల్‌లో కూడా కొందరు సీనియర్లు తమకు భోజనం తీసుకురావాలని, ప్లేట్లు శుభ్రం చేయాలని హుకుం జారీ చేస్తున్నట్లు తెలిసింది. హాస్టల్‌లో ప్రతి రోజు రాత్రి సీనియర్లు వీడియోగేమ్స్ ఆడించి స్కోర్‌ను తెలపాలని జూనియర్లను వేధిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కాలేజీ, హాస్టల్ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. కొత్తగా చేరిన రోజుల్లో ఓ డాక్టర్ హాస్టల్‌లో ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలి. కానీ అది కనిపించడం లేదు. హాస్టల్ వార్డెన్, డిప్యూటీ, అసిస్టెంట్ వార్డెన్లు ర్యాగింగ్ వేధింపులు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తెరుచుకోని ర్యాగింగ్ ఫిర్యాదుల బాక్స్

కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్టల్‌లో కొత్త విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ర్యాగింగ్ ఫిర్యాదుల బాక్సులు ఇంత వరకు ఓపెన్ కాలేదు. కాలేజీ ఆవరణలోని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, మెన్స్ హాస్టల్, ఉమెన్స్ హాస్టల్‌లో ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేశారు. కొత్త విద్యార్థులు వచ్చి 9 రోజులు అవుతున్నా ఇంత వరకు బాక్సులను తెరవకపోవడం విమర్శలకు తావిస్తోంది.





కాలేజీలో ఉన్న ఫిర్యాదుల బాక్స్

ర్యాగింగ్‌తో విచారణ కమిటీ

కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ ఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఆరుగురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఆమె మాట్లాడుతూ కమిటీలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సాయిసుధీర్, కన్వీనర్‌గా ఉంటారు. సభ్యులుగా వైస్ ప్రిన్సిపాల్ పి. హరిచరణ్, సైక్రియాట్రి ప్రొఫెసర్ మెన్స్ హాస్టల్ వార్డెన్ ఎస్.నాగేశ్వరరావు, మాధవీశ్యామల, సర్జరీ ప్రొఫెసర్, ఉమెన్స్ హాస్టల్ వార్డెన్ అఫ్తామాలజి ప్రొఫెసర్ యుగంధర్ రెడ్డి, మెడిసిన్ హెచ్‌వోడీ ఇక్బాల్ హుసేన్ కొనసాగుతారు. విచారణ రెండు రోజుల్లో జరిపి నివేదికను ప్రిన్సిపాల్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఈ నెల 21న రాత్రి వైస్ ప్రిన్సిపాల్ విజయానందబాబు, వార్డెన్ నాగేశ్వరరావుతో కలిసి మెన్స్ హాస్టల్‌లో తనిఖీలు చేసినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. కొటేషన్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేసి హాస్టల్స్‌లో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు రోస్టర్‌గా ఉన్న డాక్టర్ పర్యవేక్షిస్తారన్నారు. ర్యాగింగ్ ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ప్రిన్సిపాల్ తెలిపారు

సీబీసీఐడీ విచారణకు ఆదేశం..!

- ఆర్‌వోఆర్ కేసు విచారణలో అధికార దుర్వినియోగం
- హైకోర్టును ఆశ్రయించిన బాధితులు
- మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని సీబీసీఐడీని ఆదేశించిన హైకోర్టు



నంద్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలంలోని గత రెవెన్యూ అధికారుల, సిబ్బంది పనితీరుపై సీబీసీఐడీ విచారణ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 412, 412-2లోని భూమికి సంబంధించిన ఆర్‌వోఆర్ కేసు విచారణలో అప్పటి తహసీల్దార్ డి రవి కుమార్ నిర్వహించిన విచారణలో లోపాలున్నాయని రూపనగుడికి చెందిన చిన్ననరసన్నగారి రుద్రయ్య, సుశీల దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ నుంచి కలెక్టర్, డీఆర్‌వో, ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో తదితరులను ప్రతివాదులుగా చేర్చుతూ హైకోర్టులో వారు రిట్ పిటీషన్ దాఖలు చేశారు. ఉయ్యాలవాడ మండలం రూపనగుడి గ్రామానికి చెందిన ఎగ్గోని తిమ్మారెడ్డి సర్వే నంబర్ 412లో తనకు చెందిన 2.24 ఎకరాల భూమికి గాను 1.12 ఎకరాల భూమి మాత్రమే నమోదైందని, మిగిలిన భూమి తన పేరిట ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని 2023 అక్టోబరులో సంబంధిత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సమస్య విచారణలో భాగంగా ఆ సర్వే నంబరులోని రైతులందరికీ అప్పటి తహసీల్దార్ రవి కుమార్ నోటీసులు జారీ చేశారు. నోటీసుల అందుకున్న రైతులు 2023 అక్టోబరు 17న విచారణకు హాజరయ్యారు. ఇందులో భాగంగా రైతుల స్టేట్‌మెంట్లను గ్రామ వీఆర్వో వెంకటలక్ష్మమ్మ రికార్డు చేశారు. ఇందులో భాగంగా రైతుల్లో ఒకరైన వెంకటేశ్వరరెడ్డి పేరిట స్టేట్‌మెంటు ఇచ్చినట్లు నమోదు చేశారు. వాస్తవానికి తోట వెంకటేశ్వరరెడ్డి 2014లోనే చనిపోయినట్లు రికార్డుల్లో ఉంది. అయితే ఇవేవీ పట్టించుకోని రెవెన్యూ అధికారులు వెంకటేశ్వరరెడ్డి పేరుతో స్టేట్‌మెంటును నమోదు చేసి, ఆయన బంధువుతో సంతకం చేయించారు. రెవెన్యూ అధికారులు అంతటితో ఆగకుండా సుశీల పేరుమీద ఉన్న 1.12 ఎకరాల భూమిని రైతు తిమ్మారెడ్డి పేరు మీద ఆన్‌లైన్ చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో తమకు అన్యాయం జరుగుతుందని భావించిన రుద్రయ్య, సుశీల హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. ఆర్‌వోఆర్ కేసు విచారణలో భాగంగా చనిపోయిన వ్యక్తి పేరు మీద రెవెన్యూ అధికారులు స్టేట్‌మెంట్ నమోదు చేసినట్లు వారు హైకోర్టుకు నివేదించారు. అప్పటి తహసీల్దార్ రవి కుమార్, రెవెన్యూ సిబ్బంది ప్రాథమికంగా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు హైకోర్టు విచారణలో వెల్లడవ్వడంతో ఈ ఘటనపై సమగ్రంగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు సీబీసీఐడీని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని సమగ్ర విచారణ నిర్వహించి మూడు వారాలలోపు సీల్డు కవరులో కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.

న్యూస్ బాక్స్

వలస కూలీ ఆత్మహత్య

పెద్దకడుబూరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక వలసకూలీ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కర్ణాటక రాష్ట్రంలో మంగళవారం జరిగింది. మండల పరిధిలోని మురవణి గ్రామానికి చెందిన ఉప్పర చిన్న రంగయ్య(40) మూడు రోజుల క్రితం భార్య, కూతురుతో కర్ణాటక రాష్ట్రానికి వలస వెళ్లాడు. మంగళవారం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో అందుబాటులో ఆసుపత్రి లేకపోవడంతో నొప్పి భరించలేక పొలాల్లో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రంగయ్యకు భార్య, ముగ్గురు పిల్లల సంతానం ఉన్నారు. సొంత ఊరిలోన ఉపాధి లేకపోవడంతో వ్యవసాయ కూలీలు పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. చిన్న రంగయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పీఆర్ ఈఈ ఎం. రఘురామిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పీఆర్‌ఐ, పీఐయూ డివిజన్ల పరిధిలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని నంద్యాల డివిజన్ పీఆర్‌ఐ, కర్నూలు పీఐయూ ఈఈ ఎం.రఘు రామిరెడ్డి ఆదేశించారు. జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సబ్‌డివిజన్ అధికారులతో ఏపీఆర్‌ఆర్‌బీ, పీఎంజేఎస్‌ఐ, నాబార్డు పనులపై సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రోడ్ల నిర్మాణాల పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయని డీఈలను అడిగి తెలుసుకున్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా 447 పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈఈ టు పీఏ పి.శిల్పాశ్రీ, డీఈఈలు రామ్మోహన్, గంగాధర్, నాగశ్రీనివాసులు, మల్లికార్జున, మన్మథబాబు, ఏఈఈలు పాల్గొన్నారు.

తంగడంచ విత్తనోత్పత్తి సంస్థపై ప్రత్యేక దృష్టి

సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గంలోని తంగడంచ విత్తన ఉత్పత్తి క్షేత్రంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం అమరావతిలోని ఏపీఎస్‌ఎస్‌డీసీఎల్ కార్యాలయంలోని తన చాంబరులో సంబంధిత అధికారులతో చైర్మన్ సుబ్బారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తంగడంచ విత్తన ఉత్పత్తి క్షేత్రానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విత్తనాల కొరత ఉందని, వాటిని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తంగడంచ విత్తన ఉత్పత్తి క్షేత్రం అభివృద్ధిపై ఈ నెల 29న జరిగే బోర్డు మీటింగ్‌లో ప్రత్యేకంగా చర్చించనున్నట్లు తెలిపారు.

రైతును దగా చేస్తున్న సీసీఐ



5వ పేజీ తరువాయి

అక్టోబరు మొదటి వారం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి కొనుగోలుకు ఆ సంస్థ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పత్తి సాగయ్యే ప్రతి నియోజకవర్గంలో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. కేవలం ఆదోని, పెంచికలపాడు, కోడుమూరు, నంద్యాలలో మాత్రమే పత్తి కొనడానికి జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలను మార్కెటింగ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలుతో పాటు నందికొట్కూరు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, నంద్యాల జిల్లాలో ఎక్కువగా పత్తిని సాగు చేస్తున్నారు. అయితే కేవలం నాలుగు చోట్ల మాత్రమే ఏటా సీసీఐ సంస్థ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో దూర ప్రాంతాల్లోని రైతులు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాల్సి వస్తున్నది. ప్రతి నియోజకవర్గంలోనూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పత్తి రైతులు మొర పెట్టుకుంటున్నా సీసీఐ సంస్థతో పాటు మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపు 2.20 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతుంటే.. కేవలం ఆదోని, కోడుమూరు, నంద్యాలలో మాత్రమే పత్తి కొనుగోలు జరుపుతుండటంతో రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

మరోవైపు దళారులు, వ్యాపారులు గ్రామాలకు లారీలలో తీసుకెళ్లి పత్తిని రైతుల నుంచి కొని రాత్రికిరాత్రి పక్క రాష్ట్రాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలిస్తుండటంతో మార్కెటింగ్ శాఖ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మార్కెట్ యార్డులో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తే తమకు న్యాయం జరుగుతుందని అధికారుల పర్యవేక్షణ ఉండడం వల్ల అక్రమాలకు చోటు ఉండదని రైతులు గత ఐదు సంవత్సరాలుగా మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నా ఏ మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోలు కేంద్రాలు


సీసీఐ ఖర్చులను తగ్గించుకునేందు కోసం జిన్నింగ్ మిల్లులోనే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఈ విధానం వల్ల రైతులు అన్యాయానికి గురవుతున్నారు. రైతులు పత్తిని దూర ప్రాంతాల్లోని ఆదోని, ఎమ్మిగనూరు, పెంచికలపాడు కొనుగోలు చేసేందుకు రైతులు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వెనక్కి తీసుకెళ్లాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లాలో నంద్యాలలో మాత్రమే ప్రతి సంవత్సరం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కాగితాల్లో చూపడం తప్పితే.. అక్కడ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం ఆ జిల్లా పత్తి రైతులు దళారులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని రైతులు స్పష్టం చేస్తున్నారు. సీసీఐ సంస్థ అధికారులు మాత్రం రైతుల విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదు. జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే తమకు రవాణా ఖర్చులు తగ్గిపోతాయని రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లుల్లోనే జిన్నింగ్ చేపట్టేందుకు ఏ మాత్రం ఖర్చు ఉండదని చెబుతున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ విధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలే గాని, జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎలా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా వ్యాపార సంస్థ లాగా మారి తమకు తీరని నష్టాన్ని కలిగించడం దారుణం అని వారు ధ్వజమెత్తుతున్నారు.

పత్తి అమ్మకాల్లో అక్రమాలు ఎన్నెన్నో..

పత్తి కొనుగోలు కేంద్రాలను తమకు అనుకూలంగా కాకుండా మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకే సీసీఐ సంస్థ నిర్ణయిస్తుండటంతో రైతులు మరోదారి లేక గ్రామాల్లోనే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల దళారులు, వ్యాపారులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. తక్కువ తూకంతో పాటు తాము చెప్పిన ధరకే కొనుగోలు చేస్తామని, లేకపోతే మీ ఇష్టం అని రైతులకు తెగేసి చెబుతుండటంతో మరోదారి లేక రైతులు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కోడుమూరు నియోజకవర్గంలోని పెంచికలపాడు జిన్నింగ్ మిల్లులో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు, దళారులు అక్కడే తిష్ట వేసి సీసీఐ నాసిరకంగా ఉందని రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయకపోవడంతో మరో దారి లేక రైతులు దళారులకే విక్రయించాల్సిన పరిస్థితి ఉంది. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం ఒక క్వింటానికి రూ.7021గా మద్దతు ధరను నిర్ణయించింది. అయితే.. సీసీఐ నిబంధనలతో 90 శాతం మంది రైతులు పత్తిని వెనక్కి తీసుకెళ్లి గ్రామాల్లోనే దళారులకు అమ్మేశారు. కేవలం క్వింటానికి రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే ధర దక్కిందని రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

కల్తీ విత్తనాలతో నిండా మునుగుతున్నాం

రెండేళ్లుగా నాసిరకం పత్తి విత్తనాలతో రైతులు దిగుబడి తగ్గిపోయి నష్టపోయారు. 2021లో దాదాపు రూ.లక్ష హెక్టార్లలో జాదురకం విత్తనాలను వాడి దిగుబడి కేవలం 1 లేదా 2 క్వింటాళ్లు మాత్రమే ఎకరాకు పరిమితమై రైతులు పూర్తిగా నష్టపోయారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పత్తి రైతులు ధర్నాలు, నిరసనలు తెలపడంతో గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతుల పొలాలకు వచ్చి దిగుబడులు తగ్గడానికి నాసిరకం విత్తనాలే కారణమని నిగ్గు తేల్చారు. వారి నివేదిక ఆధారంగా రైతులకు నష్టపరిహారం రూ.20 కోట్లు చెల్లించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తేల్చి నివేదిక కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపారు. 2021లో ఈ దారుణం జరిగితే.. ఇప్పటికి కూడా ఆ రైతులకు పరిహారం చెల్లించకపోవడం దారుణం.





కమిషనరేట్‌లోనే పెండింగ్‌లో ఉంది

2021లో ఖరీఫ్‌లో రైతులు కావేరి కంపెనీ చెందిన జాదూరకం పత్తి విత్తనాలను కొనుగోలు చేశారు. రైతులకు కేవలం ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి లభించింది. నాసిరకం విత్తనాలు అని నంద్యాల, గుంటూరు పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు రైతుల పొలాలకు వెళ్లి పరిశీలించి నిర్ధారించారు. నివేదిక మేరకు రైతులకు పరిహారాన్ని దాదాపు రూ.20 కోట్లు చెల్లించాలని కావేరి సంస్థకు నోటీసులు ఇచ్చాము. కోర్టు ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ ఆ రైతులకు రాయితీని అందించాల్సిందేనని నిర్ధారించారు. వివిధ కారణాల వల్ల నష్టపరి హారం అందలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పరిహారాన్ని అందజేస్తాం.

- వరలక్ష్మి, జేడీ, కర్నూలు



వచ్చేనెల నుంచి పత్తి కొనుగోలు

రైతుల నుంచి పత్తి కొనుగోలు వచ్చే నెల నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సీసీఐ నిర్ణయించిన నిబంధనల మేరకే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తాం. ఆ సంస్థ అధికారుల నిర్ణయం మేరకే రైతులు పత్తిని అమ్ముకోవాలి. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం క్వింటం పత్తికి రూ.7,520 మద్దతు ధరగా నిర్ణయించింది. రైతులు జిన్నింగ్ మిల్లులోని కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన పత్తిని తీసుకెళ్లి మద్దతు ధరను పొందవచ్చు. పత్తి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయడం లేదు.

- నారాయణమూర్తి, ఏడీఎం

ర్యాంకులపై ఆందోళన వద్దు : డీఎంహెచ్‌వో



డీఎంహెచ్‌వో భాస్కర్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్‌ఎం (గ్రేడ్-3)ల ర్యాంకుల విషయంలో తలెత్తిన సందేహాలపై ఆందోళన చెందొద్దని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 2019 సెప్టెంబరు 21న 2735 మంది అభ్యర్థుల మొదటి జాబితా ప్రభుత్వం నుంచి అందిందని, ఆ తర్వాత కొంత మంది కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే ఏఎన్‌ఎంలు, ట్రైబల్, రూరల్ అర్బన్ ప్రాంతాల్లో ఉన్న వారి సర్వీసు మార్కులను సరి చేసి రెండో విడత జాబితాను 2742 మందితో పంపించారన్నారు. మరలా ప్రభుత్వ పరీక్ష రాసిన అందరూ అభ్యర్థులకు 15 బోనస్ మార్కులు కలిపి (30+15=45) 4431 మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాను 2019 అక్టోబరు 30న ప్రభుత్వం పంపించిందన్నారు. 2024 అక్టోబరు 19న విడుదల చేసిన ఏఎన్‌ఎం గ్రేడ్-3 రివైజ్డ్ ప్రొవిజినల్ సీనియార్టీ లిస్టులో చూపించిన ర్యాంకులు ప్రభుత్వం నుంచి నియామక సమయంలో మూడోసారి అందిన 4431 మంది అభ్యర్థులతో కూడిన అర్హత జాబితాలో ఉన్నాయని తెలిపారు. రెండో, మూడో జాబితాల వల్ల ర్యాంకులు మారాయని దీన్ని ఏఎన్‌ఎం గుర్తించాలన్నారు. ప్రభుత్వం నుంచి అందిన అర్హుల జాబితాను గ్రేడ్-3 ఏఎన్‌ఎం ఉద్యోగులు సరి చూసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలను జిల్లా వెబ్‌సైట్ కర్నూలు.ఏపీ.జీవోవీ.ఇన్, నంద్యాల జిల్లా వెబ్‌సైట్ నంద్యాల.ఏపీ.జీవోవీ.ఇన్‌లో ఉంచామన్నారు.

ఉమ్మడి జిల్లాలో దాదాపు 250 వెకెన్సీలు: ఉమ్మడి జిల్లాలో సచివాలయ ఏఎన్‌ఎంల పదోన్నతుల ఖాళీలు దాదాపు 250 పైగా ఉన్నట్లు సమాచారం. అందులో కర్నూలు జిల్లాలో 99 ఖాళీలు ఉండగా.. మిగిలిన నంద్యాల జిల్లాకు చెందినవి. పదోన్నతుల ఖాళీల వివరాలు ఇంకా నంద్యాల జిల్లాకు సంబంధించి రావాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కోడుమూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణానికి చెందిన బోయరవి హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేశామని సీఐ తబ్రేజ్ తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గత నెల 22న గూడూరు సమీపంలోని కల్లందొడ్డిలో బోయ రవి హత్యకు గురయ్యాడన్నారు. ఈ కేసును సమగ్రంగా విచారించి గూడూరుకు చెందిన సంజ్యపోగు అలెగ్జాండర్ హత్య చేసినట్లు గుర్తించామన్నారు. నిందితుడి కోసం గాలించి ఈ నెల 21న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐలు తిమ్మయ్య, మధుసూదన్‌రెడ్డి, ఏఎస్‌ఐ మస్తాన్, కానిస్టేబుళ్లకు రివార్డును ఇచ్చినట్లు తెలిపారు.

పోస్టింగ్ కోసం ఎదురుచూపులు



- కేజీబీవీలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టి.. ఉన్న కోర్సులును ఎత్తేశారు
- ఉద్యోగులను సర్దుబాటు చేశారు..
- మరి కొందరికి పోస్టింగ్ ఇవ్వలేదు
- ఆత్మహత్యే శరణ్యమంటున్న కాంట్రాక్ట్ టీచర్లు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలు గాలిలో దీపంలా మారాయి. ప్రశాంతంగా ఉద్యోగాలు చేస్తామనే నమ్మకం రోజురోజుకు సన్నగిలుతోంది. అధికారుల దయదాక్షిణ్యాల మీద ఆధారపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడల్లా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసే ఉద్యోగులు క్షణ క్షణం బతుకులు ఈడ్చాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లా సమగ్ర శిక్ష పరిధిలో కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూల్ వసతి గృహల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్స్ విధానంలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఆదోని కేజీబీవీ ఒకేషనల్ పాఠశాలలో రిటైల్ మేనేజ్ మెంట్ గ్రూపును, ఎమ్మిగనూరులో ఎంఈసీ గ్రూపులను ఎత్తివేసి, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించిన సబ్జెక్ట్ టీచర్స్‌ను అవసరం ఉన్న చోటుకు సర్దుబాటు చేయాలని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమరావతి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మిగనూరులో పనిచేసే పీజీటీగా జానకమ్మను పెద్దకడబూరుకు, పి రాజేశ్వరిని హాలహర్వికి, సి.బెళగల్‌కు వేణు మాధవిని సర్దుబాటు చేశారు. అయితే ఆదోని కేజీబీవీలో పనిచేసే హేమలత, భారతికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు. వారు పోస్టింగ్ కోసం జిల్లా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

మంగళవారం నేరుగా కర్నూలు విద్యా శాఖ కార్యాలయానికి వచ్చి డీఈవో శామ్యూల్‌ను కలిసి తమను అవస రం ఉన్న చోట సర్దుబాటు చేసి ఉద్యోగంలో కొనసాగేలా చూడాలని కోరారు. జిల్లాల్లో ఖాళీ ఏర్పడ్డాక ఉద్యోగాలకు నోటిఫికేషన్ ప్రకటించారు. ఉద్యోగాల నియామక ప్రక్రియ మరో ప్రక్క కొనసాగుతుండడంతో తమ కొలువులు ఉంటాయో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను కొనసాగించకపోతే తమ బతుకులు రోడ్డున పడుతాయని వాపోయారు. జిల్లా సమగ్ర శిక్షలో అసలు ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

పోస్టింగ్ ఇవ్వాలి



ఆదోని కేజీబీవీ ఒకేషనల్ పాఠశాలలో రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఎత్తివేసి, ఎంపీహెచ్ డబ్ల్యూవో కోర్సు ఏర్పాటు చేశారు. మమ్మల్ని అవసరమున్న చోటుకు సర్దుబాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఎక్కడ కేటాయించ లేదు. జీసీడీవోను కలిస్తే, సమాధానం ఇవ్వడం లేదు. ఎలాంటి జీవనధారం లేదు. పోస్టు ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యం.

- హేమలత, కేజీబీవీ కాంట్రాక్ట్ టీచర్

స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులను అమలు చేయాలి



ఎస్ఎస్ఏ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులను అమలు చేయాలి. ఇప్పటికే ముగ్గురిని ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశారు. మమ్మల్ని మాత్రమే పెండింగ్‌లో పెట్టారు. కొందరిని చేసి, తమకు ఇవ్వకపోవడం దారుణం. నోటిఫికేషన్ ఖాళీలతో మా పోస్టులను భర్తీచేస్తే మా బతుకు రోడ్డున పడుతుంది.

- భారతి, కాంట్రాక్ట్ టీచర్

ఎమ్మిగనూరులో వైసీపీకి షాక్

ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు



ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీకి షాకిచ్చారు. మంగళవారం వైసీపీని వీడి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పట్టణంలోని కౌన్సిలర్లు స్వాతి (3వవార్డు), అబ్దుల్ వాహిద్ (16వ వార్డు), సరోజమ్మ(చైర్మన్ తల్లి) (25వ వార్డు), మాజీ కౌన్సిలర్ వహాబ్, నాయకులు వినయ్, జాహీర్, మన్సూర్ పెద్దఎత్తున ర్యాలీగా ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్నారు. వీరికి ఎమ్మెల్యే బీవీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో సైతం పట్టణంలోని వైసీపీకి చెందిన ఐదు మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరగా తాజాగా మరో ముగ్గురు కౌన్సిలర్లు చేరారు. టీడీపీలో చేరిన కౌన్సిలర్లలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు తల్లి సరోజమ్మ, ఆయన సమీప బంధువు మూడో వార్డు కౌన్సిలర్ స్వాతి ఉండటం విశేషం. మున్సిపల్ కౌన్సిల్‌లో టీడీపీ సభ్యుల సంఖ్య 10కి చేరింది. వైసీపీకి చెందిన మరి కొంతమంది కౌన్సిలర్లు కూడా టీడీపీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే చేరనున్నట్లు తెలిసింది. ఇది ఇలాగే కొనసాగితే ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎమ్మిగనూరు పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని గ్రహించి నేడు వైసీపీనుంచి టీడీపీలోకి చేరుతున్నారన్నారు. పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావటానికి వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి రావటం అభినందనీయమన్నారు. పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కౌన్సిలర్లు వార్డుప్రజలకు ఇచ్చిన హామీలను తాను నెరవేరుస్తానన్నారు.రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి అజెండాగా ముందుకు పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు అల్తాఫ్, ఆమాన్, వినయ్, ఇస్మాక్ తదితరులు పాల్గొన్నారు.


పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థిని

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. సీఈసీ విభాగంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శ్వేత, చెన్నకేశవపై పెచ్చులూడి పడ్డాయి. గాయపడిన విద్యార్థులను సహచర మిత్రులు, కళాశాల సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. స్టడీ అవర్‌లో ఉన్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ మధుశేఖర్ తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాసులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా గొర్రెలు, మేకల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిల్లా సమాఖ్య కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నగరంలోని పశువైద్య బహుళార్థ సాధక కార్యాలయం ప్రాంగణంలో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, ఫెడరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేత రాంపుల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం గతంలో గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని, ఇందులో భాగంగా కేంద్ర వెనుకబడిన వర్గాల సంస్థ నుంచి నిధులను తెప్పించిందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ నిధులను సక్రమంగా మంజూరు కాకుండా ఎన్నో ఆటంకాలు సృష్టించిందని ఆరోపించారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం జరిపించారు. కార్యక్రమంలో జేడీ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్లు దుర్గా ప్రసన్నబాబు, ఏడీలు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

'కొలను భారతి ఆలయాభివృద్ధిపై దృష్టి సారించాలి'

కొత్తపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏకైక సరస్వతి అమ్మవారి క్షేత్రమైన కొలనుభారతి అభివృద్ధిపై ఎమ్మెల్యే, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కాకనూరు శారధమఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ కోరారు. మంగళవారం స్వామీజీ కొలనుభారతి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

వీబీఆర్ గేట్లు ఎత్తివేత

వెలుగోడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వెలుగోడు జలాశయం స్పిల్‌వే మూడు గేట్లు తెరచి గాలేరు నదిలోకి నీటిని తెలుగుగంగ అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో అధికారులు వచ్చే నీటి ప్రవాహాన్ని బట్టి గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 264.18 మీటర్ల వద్ద 15956 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం జలాశయంలోకి లింక్ చానల్ ద్వారా 13వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. అలాగే వెలుగోడు జలాశయం స్పిల్‌వేకు చెందిన మూడుగేట్ల ద్వారా 9వేల క్యూసెక్కుల 1ఆర్, 1ఎల్ తూముల ద్వారా 70 క్యూసెక్కుల నీటిని దిగువకు అధికారులు విడుదల చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



3కే రన్‌లో పాల్గొన్న పోలీసులు, టీడీపీ, జనసేన నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నందికొట్కూరు పోలీసులు పట్టణంలో నందికొట్కూరు డిగ్రీ కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు 3కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీబీఎన్ సేవాసమితి ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణ సీఐతో పాటు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు వనజ, జనసేన మల్లె రామిరెడ్డి, జనసేన మధు, బాలరాజ్, పుష్పరాజు, రాము, రెహమాన్, చిన్న, రాజు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



తిమ్మాపురంలో రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మహానంది, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పు అయ్యే విధంగా సిబ్బంది జాగ్రత్తలు తీసుకొని ఏర్పాట్లు చేయాలని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. మండలంలోని ఎం.తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగంతో పాటు రికార్డులు, రిపోర్టులను, కాన్పుల వార్డును పరిశీలించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కాన్పునకు వచ్చే ప్రతి గర్భిణికి వీలైనంత వరకు నార్మల్ కాన్పు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టి, మాతా శిశు సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమాల ఐఈసీ మెటీరియల్ ప్రదర్శనను అవగాహన కోసం ప్రజలకు, రోగులకు అందుబాటులో ఉండే విధంగా ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భగవాన్‌దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అవస్థలు

● ఒకే గది.. ఐదు తరగతులు
● వరండా, మరుగుదొడ్డికి పరదాలు
● సమస్యల వలయంలో రుద్రవరం ప్రాథమిక పాఠశాల



వరండాలో కూర్చున్న విద్యార్థులు



మరుగుదొడ్డికి పరదా కట్టిన దృశ్యం

పాములపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో కేజీ రోడ్డుపై గల ప్రాథమిక పాఠశాలకు చెందిన మూడు గదులను నేషనల్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా కూల్చివేశారు. రూ.64 లక్షలు పరిహారం అందించారు. పాఠశాలను మే నెలలో హైవే అధికారులు కూల్చివేశారు. దీంతో ఒకటో తరగతి నుంచి ఐదు తరగతి వరకు చదువుతున్న 56 మంది విద్యార్థులను గదులు లేకపోవడంతో వెలుపల ఉన్న వరండాలో అందరిని ఒకే చోట కూర్చోపెట్టి చదువులు చెబుతుండటంతో అర్థం కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు నెలల నుంచి అవస్థలు పడుతున్నా నేటికీ నూతన భవన నిర్మాణానికి సంబంధించి అధికారులు చొరవ తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో గోడలలో నీరు చేరుతుండటంతో గోడలు కూలిపోతాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేక పోవడంతో పరదాలు కట్టారు. పాఠశాలను ఆనుకొని నేషనల్ హైవే విస్తరణ రహదారుల పనులు జరుగుతుండటంతో టీచర్లు విద్యార్థులు బయటకు వెళ్లకుండా కాపలా ఉండాల్సిన పరిస్థితి ఉంది. భద్రత లేకపోవడంతో పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రులు సంకోచిస్తున్నారు. నిధులు ఉన్నా పాఠశాల నిర్మాణం చేపట్టక పోవడంపై ఎంఈవో బాలాజీ నాయక్‌ను వివరణ కోరగా నాయకులు స్థలాన్ని కేటాయిస్తే నిర్మాణ పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

● ప్రజాప్రతినిధులు, అధికారులు



అల్లూరులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



జిల్లెల్ల గ్రామంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. అల్లూరులో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రీ సర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ముఖ్య అతిగా ఎమ్మెల్యే హాజరై రైతుల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాల న్నారు. ఆర్ఐ సత్యనారాయణ, వీఆర్వోలు స్వామన్న, వెంకటేశ్వర్లు, నరసరాజు, ఆనంద్, మద్దిలేటి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, వడ్డెమాను సర్పంచ్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య చెప్పారు. పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం తహసీల్దార్ శివ రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎంపీడీవో సుమిత్రమ్మ, టీడీపీ నాయకుడు సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, దామోదరరెడ్డి, రాజశేఖరరెడ్డి, వాసురెడ్డి, వెంకట్‌రెడ్డి, లోకానందరెడ్డి, రామిరెడ్డి, ఫరూక్‌బాషా, వెంకటేశ్వర్లు, బాలీశ్వరగౌడ్, రమణ పాల్గొన్నారు.

● పగిడ్యాలలో శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే జయసూర్య అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పీఆర్ ఏఈ జావీద్‌ను పిలించి వెంటనే మైనర్ రిపేరీలు చేపట్టాలని సూచించారు.

కొత్తపల్లి: కొత్తపల్లిలో తహసీల్దార్ ఉమారాణితో పాటు డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న గ్రామ సభలు నిర్వహించారు.జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు నాగేశ్వరరావు యాదవ్, మోహన్ యాదవ్, మండల సర్వేయర్ అనూషారాణి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

గోస్పాడు: రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని జేసీ విష్ణు చరణ్ అన్నారు. మంగళవారం జిల్లెల్లలో జరిగిన గ్రామ సభలో జేసీ పాల్గొన్నారు. ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, ఏడీ జయరాజు, తహసీల్దార్ షేక్ మోహిద్దీన్, ఆర్ఐ చంద్రమోహన్‌రెడ్డి, సర్వేయర్ రమణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాణ్యం: ఆలమూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి చెప్పారు. సర్పంచ్ మనోహర్, డీటీ శివ శంకర్, ఆర్ఐ రాము, వీఆర్వో పద్మావతి, సర్వేయరు నాగరాజు, మాజీ ఎంపీటీసీ మల్లు రామగోవిందరెడ్డి పాల్గొన్నారు.

గడివేముల: బూజనూరులో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ, డీటీ హరికృష్ణ, సర్పంచ్ రాములమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వీఆర్వో పాల్గొన్నారు.

మహానంది: బసాపురంలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బారావు, టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, రవినాథరావు, చంద్రమౌళీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: కరివేనలో గ్రామ సభను నిర్వహించారు. తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీపీ తిరుపాలమ్మ, టీడీపీ నాయకులు శివశంకరశర్మ, ఓబులేసు, శేషన్న, పరశురాం, దినకర్, శరత్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వెలుగోడు: బోయరేవులలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడ్. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, డీఐవో రవీంద్రపాల్, సర్వేర్ ఉపేంద్ర, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

మహానంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంద్యాల- గిద్దలూరు రహదారిలో మినీ లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ఆంజనేయ పురం గ్రామానికి చెందిన సుంకమ్మ, రంగస్వామి, శృతి మంగళవారం బతుకుదెరువు కోసం ఆటోలో వెళ్తున్నారు. గిద్దలూరు వైపు నుంచి వస్తున్న మినీ లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు సేఫ్టీ పోలీసులు సహకారంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

'రైల్వే కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం'

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికుల కోసం నిరంతర పోరాటం చేస్తామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ముఖ్య కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు చెప్పారు. భారతీయ రైల్వేలో యూనియన్ గుర్తింపు కోసం డిసెంబరు 4,6 తేదీల్లో రైల్వేబోర్డు నిర్వహిస్తున్న ఎన్నికల దృష్ట్యా మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం నంద్యాలకు వచ్చారు. జోనల్ యూనియన్ నాయకులు, నంద్యాల బ్రాంచీ నాయకులు శ్రీనివాస్, కిరణ్‌కుమార్, రాజు, వరప్రసాద్, కమర్షియల్ అధికారి రవిప్రకాష్, నాగరాజు, రామ చంద్రుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

శ్రీశైలం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం పురస్కరించుకుని లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమార స్వామి), నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మహా మంగళ హారతులు సమర్పించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం విజయవాడకు చెందిన పంచమ వేదం నృత్యాలయం బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తాం: సీఐ

నంద్యాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్తా తెలిపారు. మంగళవారం ఆయన శాంతిరామ్ కాలేజి సమీపంలో జాతీయ రహదారిపై సంభవించే రోడ్డు ప్రమాదాల ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు.

'స్థలాలను పరిశీలిస్తాం'

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల బొమ్మల సత్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఉన్న స్థలం నుంచి మార్పునకు గుర్తించిన చిన్న చెరువు, మున్సిపల్ టౌన్‌హాల్ ప్రదేశాలను పరిశీలిస్తామని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అంబేద్కర్ విగ్రహ స్థానం మార్పుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్వో పద్మజ, ఆర్డీవో మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జిష్ణు నాగవిజయ్ సూచించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి బాయి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న ఉన్నారు.

నిధుల కొరత లేకుండా చూడాలి

కలెక్టర్‌తో ఎంపీ సమావేశం



కలెక్టర్ రాజకుమారితో సమావేశమైన ఎంపీ శబరి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధికి నిధుల కొరతలేకుండా చూడాలని ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజ కుమారితో ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులు సకాలంలో ఉపయోగించకుంటే వచ్చే ఏడాది నిధులు కేంద్రం తగ్గిస్తుందని, ఉపాధి కూలీల పనులతో పాటు ఇతర పనులు పూర్తి చేయాలని, పనులు ఆలస్యం అయితే నిధు రాలేదని మళ్లీ ఫిర్యాదు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని చెప్పారు. గ్రామ పంచాయతీ తీర్మానం పొందిన పనుల మాత్రమే చేసేందుకు అనుమతి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపీ శబరి ప్రత్యేక చొరవతో జిల్లా వ్యాప్తంగా హిందూ శ్మశానాల అభివృద్ధికి కేంద్రం ద్వారా నిధులకు కృషి చేస్తున్నారని, గతం కంటే అదనంగా నిధులు ఖర్చు చేసి జిల్లాలో వందశాతం శ్మశానాలు అభివృద్ధి చేద్దామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు నిధులలో సమాన వాట కేటాయించి అందరి సహకారంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దాం అని కలెక్టర్ రాజకుమారి, ఎంపీ బైరెడ్డి శబరి సమాలోచన చేశారు.

విశ్వహిందూ పరిషత్‌కు ఎల్లప్పుడూ సేవలు: ఎంపీ

నంద్యాల కల్చరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్‌కు తన సేవలు ఎల్లప్పుడూ ఉంటాయని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాలలో భారతమాత దేవాలయం పక్కన విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలోని పుల్లారెడ్డి భవన్‌ను వీహెచ్‌పీ కేంద్రీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి మిళింద పరాండే మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఎంపీ బైరెడ్డి శబరి శిలాఫలకాన్ని ప్రారంభించారు. వీహెచ్‌పీ సంఘటనా కార్యదర్శులు, రాష్ట్ర అధ్యక్షులు సాయిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాముడు, సభ్యులు శంకర్‌రెడ్డి, భారతమాత సేవాసమితి కార్యదర్శి సముద్రాల మధుసూదనరావు, అధ్యక్షులు సుదర్శనం, విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ పోలేపల్లి సందీప్, జిల్లా అధ్యక్షులు చంద్రమౌళీశ్వరరెడ్డి, కిషోర్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కప్పలకుంటలో ఆక్రమణల తొలగింపు

ఆత్మకూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత కొన్నిరోజులుగా మున్సిపల్ అధికారులు ప్రధాన రహదారులకు ఇరువైపుల ఉండే ఆక్రమణల తొలగింపుపై దృష్టి సారించారు. తాజాగా పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే వాణిజ్య దుకాణ సముదాయం కలిగిన కప్పకుంటలో కూడా మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగించే పనులు చేపట్టారు. మంగళవారం రోడ్డుకు ఇరువైపుల ఉండే కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. అంతేకాకుండా వర్షాకాలంలో కప్పలకుంటలో భారీగా వర్షపునీరు నిలిచి తీవ్ర ఇబ్బందిగా మారడంతో ఆయా డ్రైనేజీలో కూడా పూడికతీత పనులు చేపట్టారు.

ఆలయ మండపాల పరిశీలన



ఆలయ పైకప్పును పరిశీలిస్తున్న నిపుణులు

శ్రీశైలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రం లోని ఆలయ మండపాలను మంగళవారం మహారాష్ట్రకు చెందిన వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ తరఫున నిపుణుల బృందం పరిశీలించింది. ఇటీవల ఈ ట్రస్టు వారు శ్రీకాళహస్తి ఆలయ పైకప్పు వర్షపు నీరు కారకుండా పాతకాలపు పద్ధతుల్లో రసాయనా లను వినియోగించి పుణరుద్ధరణ చేపట్టారు. శ్రీకాళహస్తి తరహాలోనే శ్రీశైలం దేవాలయ ప్రాంగణంలోని ఆలయ, మండపాల పైకప్పులను వర్షపునీటి లీకేజీలను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని దేవస్థానం అధికారులు ట్రస్టువారిని కోరారు. ఈ నేపథ్యంలో నిపుణులు మంగళవారం శ్రీశైలం ఆలయాన్ని సందర్శించారు.

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపల్లి అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల ప్రజా పరిషత్ మెయిన్ పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు కొత్తపల్లి ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం నాయక్, ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'పొంచి ఉన్న ప్రమాదం' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి మండల విద్యాశాఖ అధికారులు స్పందించారు. మంగళవారం హెచ్‌ఎం నాగజయశ్రీ, ఉపాధ్యాయులు శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలను పునఃపరిశీలించి భవనం ప్రమాదకరంగా ఉందని తెలుసుకుని అప్పటికప్పుడు పాఠశాల భవనం కొత్త భవనం నిర్మాణం కోసం జిల్లా అధికారులకు నివేదిక ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం అక్కడ చదువుకుంటున్న విద్యార్థులను సమీపంలోని ఉర్దూ పాఠశాలలోకి చేర్పించినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నంద్యాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్ వద్ద నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త తన సిబ్బందితో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తుం డగా పట్టుబడిన ఒక వ్యక్తిని కోర్టులో హాజరు పరచగా జడ్జి 5రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు డ్రైంకెన్ డ్రైవ్‌లో నంద్యాలలోని శ్రీనివాసనగర్‌కు చెందిన మహేష్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టు బడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రామ భూపాల్‌రెడ్డి నిందితుడికి అయిదు రోజుల జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బైకు దొంగ అరెస్టు

నందికొట్కూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మకాం వేసి ఇల్లు అద్దెకు తీసుకొని బైక్ దొంగతనాలకు పాల్పడు తున్న ఓ వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆత్మకూరుకు చెందిన షేక్ ఖాదర్ బాషా (33) అలియాస్ గుండు నందికొట్కూరు పట్టణంలోని కోట వీధిలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నాడు. నందికొట్కూరు, అల్లంపూర్ తదితర ప్రాంతాల్లో బైక్‌లను దొంగతనం చేసేందుకు నందికొట్కూరును కేంద్రంగా చేసుకున్నాడు. సెప్టెంబరు 25న పట్టణానికి చెందిన మద్దిలేటి తన బైక్ కనిపించడం లేదని పట్టణ పోలీసు లకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు మంగలవారం నంది కొట్కూరు పట్టణంలోని కోట వీధిలో షేక్ ఖాదర్ బాషా నివాసం ఉంటున్న ఇంటి వద్దే అరెస్టు చేయడంతో పాటు రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ తెలిపారు.

ఎరువుల విక్రయాలు నిలిపివేత

మహానంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గాజులపల్లిలోని రాఘవ ట్రేడర్స్‌లో ఎరువుల అమ్మకాలను నిలిపి వేసి నట్లు ఏవో నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళ వారం దుకాణాన్ని ఏవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి రసీదులు లేకుండా ఎరు వులు నిల్వలు అధికంగా ఉన్న విషయం తనిఖీలో బయట పడింది. రూ.1 లక్ష పది వేల విలువ చేసే 5.25 మెట్రిక్ టన్నుల ఎరు వుల అమ్మకాలను నిలిపివేశారు.

పోలీసు విధులపై అవగాహన

నంద్యాల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి గడివేములలోని రాజరాజేశ్వరి స్కూల్, నంద్యాల తాలుకా ఎస్ఐ గంగయ్య యాదవ్ నంద్యాల సమీపంలోని ఎస్డీఆర్ స్కూల్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీసుల విధులు, అమరవీరుల విశిష్టత, ప్రజల సహకారం అనే అంశాలపై అవగా హన కల్పించారు.

'నష్ట పరిహారం అందించాలి'

బండిఆత్మకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గాలి వానకు దెబ్బ తిన్న వరి పంట రైతులకు నష్ట పరిహారం అందించాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్ డిమాండ్ చేశారు. మంగళవారం వెంగళరెడ్డి పేట, కడమలకాల్వ, ఏకోదూరు గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించారు. రాజు, సుబ్బరాయుడు, రమణ పాల్గొన్నారు.


డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అడ్డవాగు వంతెనకు ప్రతిపాదనలు

చాగలమర్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని అడ్డవాగు నీటి ప్రవాహాన్ని పీఆర్ ఏఈ కొండారెడ్డి పరిశీలించారు. పొంగి ప్రవహించిన అడ్డవాగు అన్న శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. జిల్లా ఉన్నతాధికారులు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు మంగళవారం అడ్డవాగును పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూ.30 లక్షలతో అడ్డవాగు వంతెన నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. వంకలో పూడిక పనులు చేసేందుకు మైనర్ ఇరిగేషన్ శాఖకు నివేదికలు పంపిస్తున్నామన్నారు.

గొర్రెలకు డివార్మింగ్

చాగలమర్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 వేల గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కోసం డివార్మింగ్ చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్, పశువైద్యాధికారి సాయి తెలిపారు. మంగళవారం ముత్యాలపాడు గ్రామంలో గొర్రెలకు డివార్మింగ్ చేశారు. ఏడీ మాట్లాడుతూ 12 టన్నుల సమీకృత దాణ మంజూరైందని, 15 మంది రైతులకు దాణను పంపిణీ చేశామని అన్నారు. పశువైద్యశాలలో మందుల కోసం రూ.1.50 లక్షలు బడ్జెట్‌తో ప్రతిపాదనలు చేశామని అన్నారు. నట్టల నివారణకు, గొర్రెలు, మేకలకు టీకాలు వేస్తున్నామని, వాటి పెంపకందారులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు.



మరమ్మతులకు నోచుకోని ప్రధాన గేటు

బనగానపల్లె , అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):

బనగానపల్లె నియోజకవర్గంలో దద్దనాల ఒకే ఒక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ప్రధాన గేట్లు మరమ్మతులకు నోచుకోలేదు. పూడిక తీతకు, కాల్వల అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల కాకపోవడంతో ఈ ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుతోంది. దీని వల్ల ఈ ప్రాజెక్టు లక్ష్యాలు నెరవేరడం లేదు.



దద్దనాల ప్రాజెక్టు

దద్దనాలలో పదడుగుల పూడిక

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- 16ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని దద్దనాల

దద్దనాల ప్రాజెక్టు బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామం వద్ద నిర్మించారు. ఈ ప్రాజెక్టు కింద ప్రత్యేక్షంగా 1516 ఎకరాలకు పరోక్షంగా పదివేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 15 గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందుతోంది. గతంలో ప్రాజెక్టులోకి నీరురాక ఒట్టిపోయింది. 15 ఏళ్లుగా ప్రధాన గేట్లు, పూడిక గేట్లు మరమ్మతులకు నోచుకోలేదు. అయితే ఇందులో ఓ గేటు మరమ్మతులు చేశారు. ప్రాజెక్టు మరో ప్రధాన గేటు ఒకటి, ప్రాజెక్టుకు సంబంధించి రెండుపూడిక గేట్లు, పంటపొలాలకు నీటిని వదిలే స్లూయిస్ గేట్లు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అయితే ప్రాజెక్టుకు ఉన్న రెండు ప్రధాన గేట్లలో ఓ గేటు మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని గేట్లు

దద్దనాల ప్రాజెక్టుకు సంబంధించి గత 16 ఏళ్లుగా ఒక ప్రధాన గేటు, పూడిక గేట్లు, పంట పొలాలకు నీరు అందించే ప్రధాన గేట్లు పూర్తిగా పనిచేయడం లేదు. గత నాలుగేళ్ల క్రితం ప్రధాన గేట్లకు మరమ్మతులు చేయడానికి ప్రయత్నించినా ఒక గేటు మాత్రమే మరమ్మతులకు నోచుకుంది. ఒక్క గేటు మాత్రం నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. అలాగే పూడికగేట్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టులో 25 అడుగుల వరకు నీరు ఉండాలి. కాని మరమ్మతులకు నోచుకోకపోవడంతో 10 అడుగులకు పైగా లోతు పూడికతో నిండిపోయింది. ప్రాజెక్టుకు సంబంధించి పంటకాల్వలు దెబ్బతిన్నాయి. పంట కాల్వలు ముళ్ల కంపలతో నిండిపోయాయి. కనీసం పంటలు పండించుకుందామన్నా పంటకాల్వలు లేక రైతులు బోర్లు వేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు.

వైపీపీ హయంలో కేవలం ప్రతిపాదనలకే పరిమితం

బనగానపల్లె నియోజకవర్గంలో చెరువులకు మైనర్ ఇరిగేషన్ అధికారులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 35.10 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బనగానపల్లె దద్దనాల ప్రాజెక్టుకు సంబంధించి గేట్లు, పూడిక గేట్లు, ప్లాట్‌ఫాం, కాల్వల నిర్మాణం, లైనింగ్, జనరేటర్ తదితర పనులకు రూ. 14.12 కోట్లు, కుక్కలగంటి చెరువుకు రూ.2.80 కోట్లు, రాళ్లకొత్తూరు ఊరకుంట చెరువుకు రూ.40లక్షలు, సంజామల మండలం ముక్కమళ్ల చెరువుకు రూ.7.50 కోట్లు, హోత్రమాన్‌దిన్నె చెరువుకు రూ. 2.40 కోట్లు, రామభద్రుని పల్లె చెరువుకు రూ.20లక్షలు, కానాల చెరువుకు రూ. 6 కోట్లు, అవుకు మండలం వేములపాడు చెరువుకు రూ 20లక్షలు, మంగంపేట ఊట చెరువుకు రూ.59 లక్షలు, మంగంపేట తండా ఊట చెరువుకు 69లక్షలు, మెట్టుపల్లె చెరువుకు కూ.20లక్షలతో అధికారులు నాలుగేళ్ల క్రితం ప్రతిపాదనలు పంపారు. కాని ఒక్క చెరువుకు ఒక్క నయాపైసా విడుదల కాలేదు.

ముళ్ల కంపలు, జమ్ముతో నిండిన పంట కాల్వలు

ప్రాజెక్టు పరిధిలో 1516 ఎకరాలకు పంటకాల్వలు శిథిలమయ్యాయి. పంటకాల్వలు జమ్ము, ముళ్ల కంపలతో నిండిపోయాయి. దద్దనాల ప్రాజెక్టు 25 అడుగుల వరకు వరద నీరు వస్తే నిండిపోతుంది. ప్రస్తుతం 13 అడుగుల నీరు చేరింది. పై భాగంలో అధికంగా భారీ వర్షాలు కురిస్తే ప్రాజెక్టులోకి వస్తే ప్రాజెక్టు నిండనుంది. ప్రధాన గేట్లు, పూడికగేట్లు పనిచేయకపోవడంతో ప్రాజెక్టుకు ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. గతంలో పూడిక గేట్లు మరమత్తులకు, ప్రధానగేటు మరమత్తుల కోసం నిధులు విడుదల చేయాలని నివేదికలను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు.



మరమ్మతులకు నోచుకోని పూడిక గేట్లు

ప్రజలకు జవాబుదారిగా పని చేయాలి

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

డోన్ అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పట్ల జవాబుదారీగా అధికారులు పని చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు భారీగా తరలివచ్చి వినతులను సమర్పించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులకు సంబంధించి నేరుగా ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో వినూత్న ఆలోచనలతో పాలన అందిస్తున్నారని అన్నారు. ప్రజలు ఎంతో ఆశతో వచ్చి గ్రీవెన్స్‌లో తమ సమస్యలను వినతుల రూపంలో చెప్పుకుంటున్నారనీ అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల కోసం పని చేయాలన్నారు. డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించేందుకు అన్ని శాఖల అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి విజయభట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ఓంప్రకాష్, రామిరెడ్డి, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, సీనియర్ నాయకులు సందు వెంకటరమణ, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్, పీఆర్ ఏఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలి

డోన్ రూరల్ అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ చట్టం (ప్రొటెక్షన్ యాక్టు) తీసుకురావాలని డోన్ బార్ అసోసియేషన్ మాజీ కోశాధికారి న్యాయవాది పులిదామోదర్ కోరారు. ఈ మేరకు డోన్ మండలంలోని ఆర్అండ్‌బీ గెస్టు హౌస్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

రుద్రవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం రుద్రవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజా సమస్యలపై వేదిక నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 152 దరఖాస్తులు వివిధ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేసి సీఎం క్యాంపు ఆఫీసుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అక్కడి నుండి సంబంధిత అధికారులకు ఆదేశాలు వస్తాయన్నారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు ఎవరైనా చింపివేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. దీపావళికి దీపం కనెక్షన్ పంపిణీ చేస్తామన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. మండలానికి 25 గోకులాలు గతంలో మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం మండలానికి 10 అదనంగా మంజూరయ్యాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గోకులాలు అందిస్తామన్నారు. తెలుగుగంగకు సాగునీరు పూర్తిస్థాయిలో అందించి రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దారు మల్లికార్జునరావు, ఏఈలు రఘురాముడు, కమాల్‌సాహెబ్, సుబ్రహ్మణ్యం,నాగరాజు, ఏపీవో ప్రతాప్, టీడీపీ నాయకులు రంగనాయకులు, పోలా గురుమూర్తి, పత్తి సత్యనారాయణ,బ్రహ్మయ్య, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి రాజారావు, శేకర్, ఎర్రం ప్రతాప్‌రెడ్డి, పెద్దపుల్లారెడ్డి, రెక్కల మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న అధికారి శ్రీనివాసులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలను, మహిళలపై లైంగిక దాడుల నుంచి పిల్లలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులకు అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించరాదన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వర్ రావు, సోషల్ వర్కర్ ఓబులమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సేవలు ఉపయోగించుకోండి

ఉయ్యాలవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయాధికారుల సేవలను ఉపయోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధాకరరెడ్డి కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పుట్టా భాగ్యమ్మ అధ్యక్షతన ఎంపీడీవో ఉమామమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను శనగ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రబీ సీజనులో రైతులు సాగు చేస్తున్న శనగ పంటకు విత్తనాలను ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఇటీవల వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున రైతులు విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ గురప్ప సూచించారు. సమావేశంలో ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అయోడిన్ లేని ఉప్పుతో రుగ్మతలు



మాట్లాడుతున్న కాంతారావు నాయక్

శిరివెళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : అయోడిన్ లేని ఉప్పును తీసుకోవడం ద్వారా థైరాయిడ్ వంటి రుగ్మతలు వస్తాయని బాల స్వస్థ ఆరోగ్య ప్రోగ్రాం జిల్లా అధికారి కాంతారావు నాయక్ సూచించారు. శిరివెళ్లలోని పీహెచ్‌సీతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన మాసాంతపు సమీక్షా సమావేశాన్ని ఆయన పరిశీలించారు. అయోడిన్ కలిగిన ఉప్పుతో మెదడు అభివృద్ధి చెందుతుందని, జీవక్రియలు మెరుగవుతాయని, గాయిటర్, గొంతు సంబంధిత వ్యాధులు రాకుండా రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఆయన సూచించారు.

రబీలో 55,955 హెక్టార్ల పంటలు సాగు

కొలిమిగుండ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో పప్పుశనగతో పాటు ఇతర పంటలు 55,955హెక్టార్లలో రైతులు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ ఏడీఏ సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించి, రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కంది పంటను సందర్శించి, కంది ప్రస్తుతం పూత దశలో ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో ఏవో భూమా జ్యోతి, పశువైద్యాధికారిణి డా.పద్మావతి, ఏఈవో నాగరాజు, వీఏఏలు సుబ్రమణ్యం, వనిత, టీడీపీ నాయకులు గూడురు నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చిన్నపిల్లలతో పనులు చేయిస్తే జైలు శిక్ష

బేతంచెర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ దుకాణాల్లో, హోటళ్లలో, బైక్ షాపుల్లో చిన్న పిల్లలతో పనులు చేయించుకుంటే జైలు శిక్ష తప్పదని దుకాణాల యజమానులు డోన్, బనగానపల్లె లేబర్ అధికారులు నీలిమ, సంధ్య, శోభారాణి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వివిధ వ్యాపార దుకాణాలను, హోటళ్లను, బైక్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలను దుకాణాల యజమానులు పనుల్లో పెట్టుకోకూడదని, అలా పెట్టుకుంటే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఐసీపీఎస్ అధికారిణి నాగజ్యోతి, లీగల్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, సీఆర్పీ నాగేషుడు, ఏఎ్‌ఎఐ వెంకటనారాయణ, పోలీసు కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

డోన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సుధాకర్



ప్యాపిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డోన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కుమ్మరి సుధాకర్ ఎన్నికయ్యారు. మంగళవారం ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ గవర్నర్ కార్యాలయం నుంచి తనకు నియామక ఉత్తర్వులు అందినట్లు సుధాకర్ తెలిపారు. కుమ్మరి సుధాకర్ ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి సుధాకర్ టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా, దక్షణభారత శాలివాహన ఫెడరేషన్ యువసేన అధ్యక్షుడిగా పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.

డోన్‌లో జాబ్‌మేళా

డోన్ రూరల్ అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు మూడు కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 20 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేళాలో సుప్రజిత్ ఇంజనీరింగ్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేటు లిమిటెడ్, డయికిన్ ఇండియా లిమిటెడ్ వంటి బహుళ జాతీయ కంపెనీలు ఈ మేళా నిర్వహించారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్లు ఆర్ఎస్.ధర్మకర్, సూర్యశేఖర్ రెడ్డి, నాగకేశవులు, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోట్ల పరామర్శ

డోన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు చిన్నమద్ది కుటుంబ సభ్యులను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నమద్ది కుమారుడ్ని ఎమ్మెల్యే కోట్ల పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందించేలా చూడాలని డాక్టర్లను కోరారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ప్యాపిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వ రెవెన్యు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు భారతి తెలిపారు. మంగళవారం మండలంలోని జక్కసానికుంట్ల గ్రామంలో రెవెన్యు గ్రామ సభను నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ భూవివాదాలు, పట్టాదారు పాస్‌బుక్కులు, రస్తావివాదాలు వంటి తదితర సమస్యలు ఉంటే వినతులు ఇవ్వాలని సూచించారు. వాటిని పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామసభలో 27 మంది రైతులు వివిధ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు.

డోన్ రూరల్: మండలంలోని కామగానిగుంట్ల గ్రామంలో భూరీసర్వేపై గ్రామసభను ఏర్పాటు చేశారు. సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేలపై గ్రామసభలు ఏర్పాటు చేస్తుందని డోన్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. కార్యక్రమంలో డోన్ మండల ఆర్ఐ మస్తాన్, సర్వేయర్ జగదీష్, గ్రామ రెవెన్యూ అధికారులు భాస్కర్ నాయుడు, గోవిందు, మోహన్‌రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: భూరీసర్వే సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు మల్లికార్జున రావు అన్నారు. మంగళవారం మండలంలోని చిలకలూరు గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో రైతుల నుంచి 85 దరఖాస్తులు వచ్చాయన్నారు.

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లె మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కరించాలని 10 మంది రైతులు అర్జీలు ఇచ్చారని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ మాధవ్, ఎంఎల్ఎస్‌వో నాగప్రసాద్, సర్పంచ్ బాలసుబ్బయ్య, వీఆర్వోలు ఉన్నారు.

బనగానపల్లె: అప్పలాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహిచారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో అనేక సమస్యలు రైతులు ఎదుర్కొన్నారని, ఆసమస్యలను పరిష్కరించడానికి గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు నారాయణరెడ్డి అన్నారు.

ఉయ్యాలవాడ: గోవిందపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో 606 ఎకరాలను రీసర్వే చేశామన్నారు. రీసర్వేలో సమస్యల పరిష్కారానికి ఐదు దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో దస్తగిరి, సర్వేయరు పాల్గొన్నారు.

చాగలమర్రి: భూ రీసర్వేలో భూ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చాగలమర్రి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభ వెలవెలబోయింది. సమస్యలు తెలుపుకోవడానికి రైతులు రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు మాత్రమే ఉండటం గమనార్హం. తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు.

వైద్యశాల అభివృద్ధి నిధులపై విచారణ

- నామమాత్రంగా రెండు విడతల విచారణ
- చర్యలు లేని విచారణ ఎందుకు

చాగలమర్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అంజలి వైద్యశాల అభివృద్ధి నిధులను దుర్వినియోగం చేశారంటూ వైద్యశాల కమిటీ చైర్మన్ వీరభద్రుడు జిల్లా డీఎంహెచ్‌వోకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం వైద్యశాలలో జిల్లా అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి ఆధ్వర్యంలో వైద్య బృందం సభ్యులు విచారణ చేపట్టారు. వైద్యశాల కమిటీ అనుమతి లేకుండా రూ.45 వేలు వైద్యురాలు అంజలి తన సొంత ఖాతాలో జమ చేసుకున్నారని కమిటీ చైర్మన్ ఆరోపించారు. ఈ విషయం గురించి కమిటీ సభ్యురాలు సర్పంచ్ ఈదుల సరోజమ్మ, తహసీల్దార్ రవికుమార్‌లచే జిల్లా బృందం విచారణ చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ వీరభద్రుడు మాట్లాడుతూ జిల్లా అధికారుల బృందం రెండు విడతలుగా విచారణ చేశారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం విచారణలతో కాలయాపన చేస్తున్నారని, చర్యలు లేని విచారణ ఎందుకని ఆరోపించారు. ఈ విచారణలో జిల్లా డీసీబీఎస్ అధికారి మాధవీలత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శివనాగిరెడ్డి ఉన్నారు.